# వంతెన

చిక్కని చీకటి.

ఆకాశం మీద నల్లని మబ్బులు.

సన్నగా వాన.

దురుసుగా ఈదురుగాలి.

ప్లాట్‌ఫారం మీద అక్కడక్కడా దూరదూరంగా వున్న తురాయి, గంగా రావిచెట్లు, వర్షంలో తడుస్తూ తలలు వంచుకుని నిల్చున్నాయి.

లాంపు పోష్టులమీద నున్న చమురు దీపాలు కొడికట్ట బోతున్నాయి.

రైల్వే లైన్ల అవతల "చిన్నూరు"లో పోగుపడ్డ పూరిళ్ళు ఆ చలికి, ఆ చీకటిలో కంబళి కప్పుకుని జోగుతున్నాయి నిద్రకు.

ఊరి మధ్య చెరువుగట్టు నున్న చింతచెట్ల మీది బుష పక్షులు స్వేచ్ఛగా ప్లాట్‌ఫారం మీదకి అప్పుడప్పుడు దాడిచేస్తు న్నాయి.

స్టేషన్ మాష్టరు గదిలో గోడగడియారం ఒకగంట కొట్టింది. గడియారంలో ముళ్ళుమాత్రంపదకొండుగంటలనేచూపుతున్నాయి.

స్టేషన్ మాష్టరు రాఘవరావు తలఎత్తి గడియారంపై ఒక సారి చూచి హరికన్ లాంతర్ని ప్లాట్‌బాక్సుకుదగ్గరగా జరిపి కుర్చీలో వెనుకకు చేరగిలా పడ్డాడు.

"మాష్టారూ! పాసింజరు బండి ఎన్నిగంటలకొస్తుందండి?"

తలఎత్తాడు రాఘవరావు. ద్వారం దగ్గర పద్దెనిమిదేళ్ళ ప్రాయంలో ఉన్న యువతి అడుగుతోంది. ఆకాశంలో సన్నని మెరుపు ఏ సవ్వడీ లేకుండ అల్లరి పిల్లలా చెంగున పరుగెత్తింది.

"ఏ పాసింజరు బండమ్మా" అడిగాడు రాఘవరావు.

"హైదరాబాదుపోయే పాసింజరు బండండి. అది సామర్లకోటకుకూడా పోతుంది కదండి" బెదురుబెదురుగా చూస్తూ అడిగిందామె.

"ఆహాఁ! ఆ ట్రైనా? నిజానికైతే అది ఈ ఊరికి ఈ వేళకు రావలసిందే. కాని ఈ రోజు రెండు గంటలు లేటు. ఒంటిగంటకు వస్తుంది"

"రెండు గంటలే! ఆ ట్రయినుకు ముందువచ్చే మరే ట్రయినూ లేదాండి?"

సుమారుగా ద్వారానికి అతుక్కుపోయి ఉందామె. కుడి కాలు గుమ్మంమీదుంచి, కుడిచేతితో ద్వారాన్ని పట్టుకుని నిలుచుంది ఆమె ముఖం తప్ప పూర్తి రూపం రాఘవరావుకు గోచరం కాలేదు. ఆమె మాటాడుతుంటే కనులు మాత్రం వింతగాకదులుతున్నాయి. రాఘవరావు భ్రుకుటిముడిచి కుర్చీలోంచి లేచి నాలుగడుగులు వేసి "లేదమ్మా. ఒకవేళ ఉన్నా పాసింజరు బండి తప్ప మరే

బండి ఆగదు. ఏం చేస్తావమ్మా! మాది చిన్న స్టేషను. మేము చిన్న మాష్టర్లం. ఏ ఊరు వెళ్ళాలమ్మా?" అడిగాడు.

"సామర్లకోట వెళ్ళాలండి" బెదురు బెదురుగా చూస్తూ అంది.

అబ్బో! చాలా దూరమే. అందులో పాసింజరు బండిలో ప్రయాణం విసుగని పిస్తుంది. ఏం చేస్తాం! ఈ స్టేషనులో మెయిలాగదు. మరి మీ ఊరిలో ఆగినట్టు ప్రతి స్టేషనులో ఆగితే నేను "మెయిలు" ఎలా అవుతానంటుంది ఆ పట్టపురాణి"

"అవునండి. అది నిజమే కదండి మాష్టారూ! ఈ ట్రైను ఆ ఊరు చేరే సరికి వెలుగు వచ్చేస్తుందాండి?"

"వెలుగు రాకేం? బాగ ఎండేకాస్తుంది"

"పోనీలెండి. స్టేషను నుండి ఊరిలోకి వెళ్ళటానికి జట్కాలు దొరకుతాయాండి?" నలుదిశలా పరికిస్తునే అడిగిందామె.

"జట్కాలు, రిక్షాలు, టాక్సీలు దొరుకుతాయమ్మ. ఏమమ్మా! ఇంతకు పూర్వం ఆ ఊరెప్పుడూ వెళ్ళలేదా?"

"లే....లే... లేదండి"

"అయినా ఫరవాలేదు. నాకా ఊరు బాగతెలుసు. నేచెబుతాలే; .. ఆఁ! అవతల చీకటిగా లేదూ! నిన్నటినుండి ఆకాశం కురుస్తాన్! ఉరుస్తాన్! కొంపలు కూల్చేస్తాన్! అంటోంది. మట్టివాసనేస్తోంది! వర్షంచినుకులుగాని పడుతున్నాయా!''

"సన్నగా వానపడుతోందండి" అంది చేతులమీద నుదిటిమీద పడ్డ వర్షపు చినుకులుతుడుకుంటూ.

"అయ్యో! వర్షంలో తడిసినట్టున్నావు. వచ్చి అలా బల్లమీద కూర్చో; అమ్మా! నీతో మరెవరైనా ఉన్నారా? వారిని లోపలికి రమ్మను" ఆహ్వానించాడు రాఘవరావు.

"మరెవరూ లేరండి. నేనే. నేనొక్కర్తినే."

"అలాగా! వచ్చి లోపలకూర్చోవమ్మా! ఫరవాలేదు. ఆ బ్యాగు టేబిల్ మీద పెట్టు. అగ్గదీ చెప్పాను కదమ్మా! మాది చిన్నస్టేషనని. మాకు ప్రయాణీకుల వెయిటింగ్ రూముంటుంది. కాని ఎవరికీ ఉపయోగ యోగ్యంకాదు ఈ స్టేషనుకు కరెంటులేదు. చమురు దీపాలేగతి. మరి చమురు దొరక పెద్దకథ. ఇద్దరు పాసింజర్లు ట్రైనెక్కితే, ఒకడు ట్రైను దిగుతాడు. 'అందుకనే ఈ స్టేషను ఎత్తేద్దామనుకున్నారామధ్య. కాని, మేం మెయిలు ట్రైన్నే ఆపించాలని చూస్తుంటే స్టేషనే ఎత్తేస్తారా?' అంటూ పెద్దలెవరో అడ్డు తగలారు. ఇది ఇలా నిలబడింది."

ఫోన్ రింగైంది.

రాఘవరావు మెసేజ్ అందుకుని, ప్లాట్ ఇచ్చి, కాబిన్‌కు ఫోన్ చేస్తూ "కొనారీ" అంటూ కేక వేశాడు.

"బాబూ!" గోడప్రక్కన బీడి కాల్చుకుంటూ కూర్చున్న కోనారి బీడిని గోడప్రక్క దాచుకుంటూ పలికాడు.

"అవుట్ కొట్టు పాసింజరుకి."

కోనారి పరుగెత్తాడు.

"పాసింజరా?" ఆతృతతో అడిగిందామె."

"మీ పాసింజరు కాదమ్మా! ఇది పూరీ వెళ్ళే పాసింజరు. మీ బండికింకా చాల వ్యవధి ఉంది. కాని నాతో కూర్చుంటే గంట

లయినా నిముషాల్లా గడిచిపోతాయి. నా ఎదురుగా మనిషి ఉంటే మాటాడకుండా ఊరుకోలేను. కానీ! అమ్మాయీ ఒక ప్రశ్న? నిన్ను చూచిన దగ్గర్నుండీ ఎక్కడో చూశాననే అనిపిస్తోంది. కాని ఎక్కడ చూశానో గుర్తుకు రావటంలేదు. ముఖం మాత్రం పరిచయమున్న ముఖంలాగే ఉంది. మీది ఏ ఊరు?"

కొద్దిసేపాలోచించి అందామె.

"ప్రక్క ఊరేనండి"

"అంటే?"

"దగ్గరి ఊరే లెండి"

"ఆ ఊరికి పేరులేదా?"

ఆమె తలదించుకుని కొద్దిసేపాగి "కృష్ణాపురమండి" అంది.

"కృష్ణాపురమా!.... ఇక్కడ నుండి మూడు మైళ్ళ దూరంలో ఒక ఊరుందని వినటమే గాని నేనెప్పుడూ అక్కడికి పోలేదు. ఇంతకూ ఎవరమ్మాయివి?" అడిగాడు.

"బాబూ! పాసింజరు బండికి టిక్కటిస్తావా?"

రాఘవరావు తాళాల గుత్తినందుకుని టిక్కట్టు ట్యూబ్ దగ్గరికి నడిచాడు.

"రెండు పెద్ద టిక్కెట్లెచ్చీబాబూ! ఒక సిన్న టిక్కట్టుఇచ్చీ, మా ఆడదానికికూడ ఇచ్చీ బాబూ!....బాబూ...మా కడనిదా క్కూడా లాకుంతవా టిక్కటి?"

"అంతకీ ఏ ఊరోయి?"

"మాదా? ఎరికనేదా, బాబూ! మాది లచ్చింపేట దగ్గరే. సేపలమ్మే ఓణ్ణి బాబూ, దశరదుడు నా పేరు" విడమరిచాడు.

మీ ఊరూ, నీ పేరూ కాదోయి. నీవు ఏ ఊరు వెడతావు? అ చెప్పు"

"బాబూ! సెప్పినను. సిమ్మాసెలం. ముంగలే సెప్పినను బాబూ. నీ వినుకోలేదు"

"ఆ ట్రైన్‌కింకా టయిముందోయి"

"ఇచ్చి బాబూ! మల్లా బండొస్తే అల్లి"

ఫోన్ రింగైంది. కోనారి ఫోన్ అందుకున్నాడు. పాసింజర్ హోమ్ సిగ్నల్ పాసయింది. కోనారి సైట్ కొట్టాడు.

రాఘవరావు పాసింజరుకి టిక్కట్టిచ్చి, కోటు తొడుక్కుని ప్లాట్‌ఫారం మీదికి కదిలాడు. కోనారి అతని వెనుక హేండ్ సిగ్నల్ పట్టీసుకుని కదిలాడు. ప్లాట్‌ఫారంమీద ఋషి పక్షు తాము దాగిన్న స్థలాలనుండి చెదిరిపోయాయి. ట్రైన్‌లోంచి ముచ్చటగా ముగ్గురే దిగారు. ఒక్కడు మాత్రమే రాఘవరావు దృష్టికందాడు. పట్టాలు దాటి అవతలకి పోయినవాడు, ఫెన్సింగ్ లోంచి సందు చేసికుని పోయినవాడు రాఘవరావుదృష్టికందలేదు.

కోనారి గంట కొట్టాడు. రాఘవరావు పచ్చదీపం చూపాడు.

ట్రైన్ కదిలింది.

తల మీద ముఖం మీద, కళ్ళద్దాలమీద పడ్డ వర్షపు చినుకులు రుమాలుతో తుడుచుకుంటూ తన సీటు ముందుకు చేరబోతున్న రాఘవరావు తెల్లబోయాడు.

టేబిల్‌మీద బ్యాగులేదు. బల్లమీద అమ్మాయిలేదు.

"కోనారీ" అంటూ కేకవేశాడు రాఘవరావు టైమ్ రిజిష్టర్ని ముందుకు లాక్కుంటూ.

"బాబూ!" సమాధాన మిచ్చాడు కోనారి.

"ఇక్కడ–ఈ గదిలో ఓ అమ్మాయి కూర్చుని ఉండాలి. ఏది?"

"ఏమో బాబూ!... నేను సూళ్ళేదు"

"పాసింజరు బండి అన్నానని కొంపదీసి ఈ బండీగాని ఎక్కేయలేదుకదా?"

"ఆ అమ్మాయంత తెలివితక్కువదాయుంటారా బాబూ?" సందేహం వెలుబుచ్చాడు కోనారి.

"కాదులే. కాని రోజులు కూడ బాగోలేవు. చూడు. నీవు ప్లాట్ ఫారంమీది కాబిన్ దిక్కు చూడు నేనిటు ప్రక్క చూస్తాను. అమ్మాయి ఒంటిగా ఉందని...నమ్మలేని రోజులివి. ఇటువంటి వార్తల నెన్నిం టిని మనం పేపర్లలో చదవటం లేదు. నీ వటు పరుగెత్తు"–పెన్ను ముడిచి ప్లాట్ ఫెనక్కి తోశాడు.

కోనారి పరుగెత్తాడు. రెండో దిక్కు రాఘవరావు పరుగెత్తాడు. పాసింజరు అవుటర్ సిగ్నల్ పాసయింది. ఉత్తరంగా దక్షిణంగా ఉన్న రెడ్ సిగ్నల్సు ఎత్తునుండి కళ్ళు చించుకుని చీకటిలోంచి చూస్తున్నాయి. దూరాన వంపు తిరిగిన నది మీదివంతెన చీకటిలో కనిపించటం లేదు. కాని ఆ వంతెనను రాఘవరావు గుర్తుపట్టగలడు.

జల్లుగా వానపడుతోంది. లాంపు పోస్టులమీది దీపాలు ఆరి పోయాయి. ప్లాట్ఫారంమీద చీకటి ముద్ద కట్టుకుంది. ముందుకు కదులుతున్న రాఘవరావు ఆగాడు. తురాయి చెట్టు క్రింద సిమ్మెంటు బల్లమీద ఏదో ఆకారం. తలమీదనుండి ముసుగు. రాఘవరావు గుర్తుపట్టాడు. "అమ్మాయీ! అమ్మాయీ! ఇక్క డున్నావా? నీ కోసం స్టేషనంతా గాలించేస్తున్నాము. అది

సరే. అక్కడంత జాగా ఉండగా ఇక్కడ ఈ చీకటిలో ఈ వానలో ఈ చలిగాలిలో కూర్చున్నావేవమ్మా! నేనేమన్నా అవతలకి పొమ్మన్నానా? పద పద"

గాలి కదిలింది. చెట్టు మీది నుండీ వర్షపు బిందువులు జలజలా రాలాయి. ఒంటి మీద పడ్డ వర్షపు బిందువులు తుడుచుకుంటూ నిలుచున్నదామె.

"పదమ్మా! పద"

"నన్నిక్కడే ఉండనివ్వండి మాష్టారూ! నాకిక్కడే బాగుంది. నాకు మాత్రం సామర్లకోటకు టిక్కెటివ్వండి" పర్సు తెరుస్తూ అందామె.

"నేను టిక్కెట్టివ్వకపోను. ట్రైన్ రాకనూ పోదు. నీవు వెళ్ళక ఆగిపోవు. ఇంద్రుడిలాంటి వాడిని నేనుండగా ఈ చీకటిలో, ఈ వర్షంలో....అందులో ఒంటరిగా... పైగా చీకటి మంచిది కాదమ్మా!... ఒంటిమీద కాస్తో కూస్తో బంగారముంది. కష్టాలు కోరి తెచ్చుకోకు... అసలు ఆడవాళ్ళు ఒంటరిగా ప్రయాణం చేయకూడదు. పైగా ఈలాంటి వాతావరణంలో. వచ్చి హాయిగా విశ్రాంతి తీసుకో. మరాలోచించకు."

"వద్దులెండి మాష్టారూ! నన్ను ఒంటరిగా ఉండనివ్వండి"

"అర్థమవుతోంది. నీ మనసు బాగోలేదు. ఇంకోమాట. నీ మనసును నేనేమైనా బాధపెట్టానా?"

"లేదండి"

"మరెందుకమ్మా! సంశయం?"

"నాకోమాట నివ్వగలరా? మాటయిస్తే వస్తాను."

"అడుగు"

"నేనెవరినో నన్నడగవద్దు. అసలు నాగురించిమీరేమీ అడగ కూడదు. నా గురించి ఎవరేమడిగినా చెప్పకూడదు. మీరు మాట యిస్తే వస్తాను "లేకపోతే ఇక్కడే ఉంటాను చెప్పండి. నాకు ప్రామిస్ చేయగలరా?" దీనంగా చూచిందామె."

నాటకాలు చూశాడు రాఘవరావు. నాటకాలెన్నో ఆడాడు, కాని ప్రస్తుత సన్నివేశం మాత్రం అతనికి వింతగా ఉంది. ఆమె మనసులో ఏదో రహస్యముంది. రాఘవరావు ఆమెవైపు చూశాడు.

చీకటిలో ఆమెకళ్ళు మెరుస్తున్నాయి. తెల్లని సాదాచీర కురిసి ప్రోగు పడ్డ మంచులా ఉంది. ముఖంలో భావాలు అతని కాచీకటిలో వ్యక్తం కావటంలేదు. స్టేషను అవతల మామిడిచెట్టు క్రింద రంగసామి జటకాగుఱ్ఱం సకిలించింది. ఎడమచేతితో నుదిటి మీద ఒకసారి రుద్దుకున్నాడు! కుడిచేత్తో ముఖం తుడుచుకుంటూ అయితే నీ గురించి అడగటానికి "ఎవరైనా వస్తారంటావా?" అని అడిగాడు.

తలఎత్తి "వస్తేరావచ్చు" అంది.

"నేను నీకు మాట యివ్వకపోతే నీవీరాత్రి యిక్కడే ఉంటావు కదూ? నీ గురించి ఎవరడిగినా చెప్పే అవకాశం నాకుంది కదూ?'' అడిగాడు.

తెల్లబోయిందామె.

"ఉన్నమాటలన్నాను కదా! అవి కొద్దిగ పరుషంగా ఉంటాయి. అయినా చెప్పక తప్పదు. చెప్తాను. నిన్ను చూసి నా కెవరో జ్ఞాపక మొస్తున్నారన్నాను కదూ? అందుచేత నీ మీద

జాలి కలుగుతోంది. నీకు సహాయం చెయ్యాలనిపిస్తోంది. నీ
గురించి ఎవరేమడిగినా చెప్పను? నిన్ను నేనే ప్రశ్నలు వెయ్యను.
సరా! ఇకపైనా వ్రతం చాలిస్తావా?"

ఆమె కళ్ళు ఆనందంతో మెరిశాయి. రెండు చేతులు
జోడించి "థాంక్స్" అంది. రాఘవరావు వెనుతిరగ బోయాడు.
ఆమె ముందుకు అడుగు వెయ్య బోయి "మాష్టారూ! ఒక మాట"
అంది.

ఏమిటన్నట్టు చూశాడు రాఘవరావు.

"నన్నిక్కడ ఎవరైనా చూసే అవకాశం ముందికదూ!" అంది.

ఆ ప్రశ్న రాదు. నాకు తప్ప ఏవరికీ కనిపించని విధంగా
దాస్తాను నిన్ను. ట్రైన్ రాగానే ట్రయినెక్కించి పంపించేస్తాను.
ఇంకా ఏమైనా సంశయాలా!" అడిగాడు.

ఏమీ లేదన్నట్టు తలూపి, అతనిననుసరించిందామె.
రూములోకి చేరుతునే తుడుచుకోటానికి తువ్వాలిచ్చాడు. చేతులు,
ముఖం, తల తుడుచుకొని తువ్వాలు నోకప్రక్కగా ఆరవేసిం
దామె. హరికేన్ దీపాన్ని ప్లాట్ బాక్స్‌కి దూరంగా జరిపాడు రాఘవ
రావు. అవతల బల్లమీద చీకటిలో కూర్చుందామె. ఫోన్ రింగైంది.
రాఘవరావు మెసేజ్ రిసీవ్ చేసుకుని కాబిన్‌కి ఫోన్‌చేసి గూడ్స్
ట్రైన్‌కి ప్లాట్ యిచ్చాడు.

ఫ్లాస్కు తెరచి రెండు కప్పుల కాఫీని సర్ది, ఆమెకొక కప్పు
ఇచ్చాడు.

"ఎనికినాను బాబూ! ఆయమ్మ ఏడకన్పడ్డేదు." కోనార్తి
వస్తూ అన్నాడు.

"సరే! ఆయమ్మ యిక్కడే ఉంది. గూడ్స్ ట్రైన్
వస్తుంది. నీ వవతల ఉండు"

"అనాగేబాబూ!" అంటూ కప్పులు రెండిటినీ పట్టుకుని అవతలికి వెళ్ళిపోయాడు కోనారి. అతను కప్పుల యథాస్థానంలో ఉంచి అవతలికి వెళ్ళిపోయేంతవరకు రాఘవరావు మాటాడలేదు అతను వెళ్ళిన తరువాత నెమ్మదిగా ముందుకు వంగి "నీవుఎవ్వరికీ తెలియనివ్వని విషయం ఒకటుంది. అది నాకూ తెలియదు. కాని తెలిసినంత మాత్రమైనా ఎవరికి చెప్పనివ్వకుండ మాట తీసుకున్నావు. మరి నిన్ను నేదాచేటప్పుడు నీవు నా నుండి రహస్యాన్ని దాచడమెందుకు?" అన్నాడు.

ఆమె తలఎత్తి అతని మాటలు పూర్తిగా విని "రహస్యాలలో కొన్నింటిని చెప్పవచ్చు. కొన్నింటిని చెప్పకూడదు. అలాగే కొన్ని చెప్పగలిగేవి ఉంటాయి. చెప్పలేనివి కొన్నుంటాయి. మరి నేనేం చెప్పేది?" అంది అతని ముఖంలోకి చూసి.

"అంత చెప్పకూడనిదా?" ఆమె కళ్ళలోకి చూశాడు. పరీక్షలో ఆమె నెగ్గింది. ఆమె కనులు దించుకోలేదు. 'ఆఁ' అని మాత్రం అంది. తృప్తిగా ఊపిరితీశాడతను.

"నిన్ను ఏ ప్రశ్న అడగనని మాటఇచ్చాను. కాని ఒక ప్రశ్న అడగక తప్పదు. నన్ను జాలితో బంధించావు. కాని నీ గురించి తెలిసి వ్యక్తి మరొకరున్నారు. నీవు జట్కాలో వచ్చి ఉంటే జట్కావాలా ఎవరి జట్కాలో వచ్చావో చెప్పు. ముందు మనం వాడిని కట్టడిచేయాలి.

"ఆ జట్కా వాడికి నా గురించి తెలుసును. అతను ఎవరికీ చెప్పడు. ఆ హామీ ఉండబట్టే వచ్చేను ఈ రాత్రి"

చాల మంచి పని చేశావు. నీపరంగా నీవు జాగ్రత్త పడ్డావు. మరి నా జాగ్రత్త నే పడవద్దూ? నిన్ను ఇక్కడనే దాచి ఉంచి

నందుకైనా వాడితో నే మాట్లాడాలి. నేను చేసేది ప్రభుత్వోద్యోగమే. కాని ప్రభుత్వం మాత్రం ప్రజలది. నా జాగ్రత్త నే పడాలి ఎవరా జట్కావాడు? రంగసామా?"

"అవును రంగసామె"

"నే వాడిని కలిసి వస్తాను. అవసరమైతే కొంత డబ్బు ముట్టచెబుతాను." అంటూ త్వరగా అవతలికి వెళ్ళిపోయాడు రాఘవరావు.

ఆమె గదిచుట్టూ గోడలమీద వ్రేలాడుతున్న రిజిష్టర్లను చూస్తూ కూర్చుంది. అయిదు నిముషాలలో వచ్చాడు రాఘవరావు. వస్తూ అన్నాడు "నీ జట్కాలోగాని అమ్మాయి వచ్చినట్టు తెలిస్తే ఊరివాళ్ళు నీ ప్రాణాలు దక్కనివ్వరు మరి నీ యిష్టం. అని అన్నాను. అది చాలదూ?"

"చాలు" అన్నట్టు తలూపిందామె.

"కాని ఊరు మాత్రం వాడిని ప్రాణాలతోవదలదు. స్టేషనుకి మూడేమూడు జట్కాలు. మిగతా యిద్దరూ ఇతని అనుమానించక తప్పరు. నేరం ఒప్పుకోక తప్పదు. నీ కేమో డబ్బున్న వారి పిల్లలా కనిపిస్తున్నావు. వాడికేమయితేనేం? నీ దారినీది?" అన్నాడు రాఘవరావు.

ఆమె అతనివైపు పరీక్షగా చూచి తలదించుకుంది.

రాఘవరావు దీపాన్ని కొద్దిగా పెద్దది చేశాడు. ఆమె దగ్గరగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. దీపం వెలుగు పూర్తిగా అతని మీద పడుతోంది. కళ్ళద్దాల నొకసారి తుడుచుకుని గొంతు సరి చేసికుని అన్నాడు.

"కొందరిని చూస్తే కొందరు జ్ఞాపకమొస్తారు. కొన్ని పరిస్థితుల చూస్తూంటే గతించిన కొన్ని పరిస్థితులు గుర్తుకు వస్తాయి. చెప్పానుగా-నిన్ను చూస్తేనాకెవరోగుర్తుకొస్తున్నారని! వారెవరో ఇదమిత్థంగా చెప్పలేను. కాని ఈ రోజున, ఈ వేళలో, ఈ వాతావరణాన్ని చూస్తూంటే పది సంవత్సరాల క్రితం జరిగిపోయిన సంఘటన గుర్తుకొస్తోంది. ఆ సంఘటన ఏమిటో తెలుసా?..."

టేబుల్‌మీద ఫోన్ రింగైంది. కాబిన్ నుండి ఫోను. గూడ్సు బండి రాక అది. కోనారి హేండ్ సిగ్నల్ చేత పట్టుకుని లైన్ల అవతలికి వెళ్ళాడు, రాఘవరావుప్లాట్‌ఫారం మీదకి వెళ్ళేసరికి గూడ్సు స్టేషనులోనికి ప్రవేశించింది. గూడ్సు పాసయింది రాఘవరావుటైమ్ రిజిష్టరులో టైమ్ నోట్ చేసేంతవరకు ఆగి, అతని ముఖం వైపు చూసించిందామె. రాఘవరావు తలఎత్తి "ఆరోజు...అంటే...అక్టోబరు పన్నెండో తారీకునాడు... ఆ రోజు కూడా ఈ రోజులాగే వర్షంపడుతోంది. రాత్రివేళ.చలితోకూడినగాలి. ఆ గాలిలో, ఆ వానలో...ఆ గాలి వానలో... నీలాగే వయసులో వున్న అమ్మాయి వయసులో వున్నకుర్రావాడు పాసింజరు, ట్రైన్ కోసం వచ్చారు. ఇక్కడికికాదు. ఈ స్టేషన్‌కి కాదు. అప్పుడు నేను స్టేషన్ మాష్టార్ని కాను. అప్పుడు నానొక చిన్న ఉద్యోగం కుటుంబం మాత్రం చిన్నదేమీ కాదు. ఇద్దరుకూతుళ్ళు. ఒక కొడుకు నేనూ, నా భార్య. ఆ రోజు రాత్రి ఒంటిగంటకు స్టేషన్‌కు చేరిన వారిరువురిని స్టేషను మాష్టారు చూశాడు. ఆమె ఆరోజునల్లని చీర నల్లని జాకెట్టు ధరించింది. ఆమెది తెల్లని శరీరం! ఆ రంగుకు నలుపు అందాన్నిస్తుందనే ఆమె భావన. కాని నీకు తెలుసో తెలియదో నలుపు అశుభాన్ని సూచన చేస్తుందంటారు... అది అలానే జరిగింది. స్టేషను మాష్టారు వారిద్దర్నీ చూశాడు. ఆమెనుమాత్రం ఎక్కడో చూసినట్టు గుర్తు. కాని అతనిని చూసిన గుర్తులేదతనికి.

ఆ రాత్రివేళ ప్రయాణిస్తున్న వారు వారని అనుమానించలేదు. వారిద్దరూ భార్యా భర్తలు ఎందుకు కాకూడదు? అన్నా చెల్లీ ఎందుకు కాకూడదు? అనుకున్నాడే గాని, వారి ముఖాలలో ఆందోళనను, అతను కనిపెట్టలేదు. వారు ఎవరికీ కనిపించకుండా చీకటివైపు పారిపోవటాన్ని అతను తప్పుపట్టలేదు. రైలురాకకోసం వారు చూపే ఆత్రుతను ఉత్సాహంగానే తీసికున్నాడు. అతను మాత్రం "డార్లింగ్" అంటున్నాడామెను. వాటిని అతను పసిగట్టలేదు. కారణం? అతను లోకానుభవం లేనివాడు. లోకం పోకడలు అతనికంతగా తెలియవు. మర్నాడు మాత్రం సింహావలోకనం చేస్తూ తను వారినెందుకు అనుమానించ లేకపోయాడో? అని ఆమె తండ్రీ ముందు తన్ను నిందించుకున్నాడు. అతను ఏ మాత్రం తెలివిగా వ్యవహరించి వుంటే "నీవెవరు? ఆమె ఎవరు అని నిలదీసి ఉండిఉంటే... ఆ అమ్మాయి ఇప్పుడీ స్థితిలో ఉండకపోవును. నందనవనంలా ఉన్న ఆ కుటుంబం నాశనం కాక నిలచి ఉండేది..ఆమె తండ్రి ఒక పల్లెటూరిలో తలదాచుకుని కుమిలి పోనవసరం ఉండేదికాదు..." రాఘవరావు ఒకసారి కుర్చీలో చేరగిలపడి కళ్ళను గట్టిగా మూసుకుని, ముందుకువంగి, కళ్ళద్దాలు తీసి రిజిష్టరుమీద పెట్టి కను కొలనులను కుడి చేతి చూపుడువేలితో తుడుచుకుని, ఆమెవంక చూశాడు. ఆమె కొద్దిగ ముందుకువంగి భ్రుకుటి ముడిచింది. అతని గొంతు క్షణక్షణానికి వింతగా మారి పోతోంది.

"ఎప్పటిలాగే ఆ రోజుకూడా ట్రైన్ వచ్చింది. వాళ్ళు ట్రైనెక్కి వెళ్ళిపోయారు. ట్రైను స్టేషనును వదలిపెడుతూ వేసిన కేకను. మగత నిద్రలో ఆమె తండ్రి విన్నాడు. కాని ఆ కేక అర్థం అతనికి తెలియలేదు. "నీకూతురు లేచిపోతోందిరోయి" అన్నదాకేక. మర్నాటి ఉదయం టేబిల్‌మీద ఉత్తరాన్ని చూశాడు

ఆమె తండ్రి. నిలువునా నీరై పోయాడు. ఆ ఉత్తరంలో ఆమె యిలా వ్రాసింది," కళ్ళుమూసుకుని కుడిచేతి చూపుడువ్రేలితో నిలువుగా ఒకటి రెండు సార్లు రుద్దుకుని అన్నాడు రాఘవరావు.

"నాన్నా!

నేనూ, రమేష్ వెళ్ళిపోతున్నాము. మా పెళ్ళికి నీ విష్టపడవని నాకు తెలుసు. నా గురించి. వెతకవద్దు. సెలవ్"— ఇదీ ఆ ఉత్తరం ఆ ఉత్తరాన్ని తండ్రిచదివాడు. అందరూ విన్నారు. ఉత్తరంలో విషయాన్ని తెలిసికున్న ఆమె తల్లి, గుండె జబ్బుతో బాధపడుతున్న అతని భార్య మనసుకు తగిలిన దెబ్బకు తట్టుకోలేక ఆ రోజు మధ్యాహ్నమే మరణించింది. ఆ రోజు అక్టోబరు పదమూడు..." రాఘవరావు కొద్దిసేపాగి టేబిల్ మీద చేతులాన్చి మళ్ళా చెప్పటం ప్రారంభించాడు.

"భార్య పోయిన బాధతో కుంగిపోతూనే కూతురికోసం ప్రయత్నాలుచేసాడు. అతనికి తెలుసు. ఆమె చాలా అమాయకురాలని. అందుకనే ఏనాటికైనా ఆమెనుయింటికితేవాలని ప్రయత్నం చేశాడు. రైల్వే స్టేషను యిచ్చిన సమాచారాన్ని బట్టి అందుకని బయలుదేరాడు. కాని ఎక్కడని వెతగ్గలడు? ఎంతకాలమని వెతగ్గలడు. నిజానికి వాళ్ళు టిక్కట్టు తీసికున్న దాక ఊరికి. వెళ్ళింది మరో చోటికి. వెతికి వేసారి పిచ్చివాడై తిరిగి వచ్చాడామె తండ్రి. ఇక ఆ ఊరిలో ఉండలేక బదిలీ పెట్టుకుని ఆ ఊరు వదిలి వచ్చాడు. ఆ రోజు నవంబరు ఏడవతారీకు. అప్పటికైనా శాంతి లభించిందా? లేదు. ఆమె చేసిన తప్పటడుగుకి ప్రతిఫలాన్ని యిప్పటికీ అతను రుచి చూస్తూనే ఉన్నాడు. కొరడా దెబ్బలు తింటూనే ఉన్నాడు. ఇది ఆ తండ్రి కథ.....ఇదీ ఆ అభాగ్యుడి కథ" కళ్ళలో చేరిన కన్నీటిని నిగ్రహించుకునే ప్రయత్నంచేస్తూ తలను క్రిందికి దించుకున్నాడు.

ఆమె మాటలు లేసిద్దైంది.

"నేను చెప్పిన ఈ సంఘటనతో నీ మనసు పాడయింది కదూ? కానీ నిన్ను బాధపెట్టాలని నేనీ విషయాన్ని నీకు చెప్ప లేదమ్మా. ఇంతకు పూర్వం ఈ కథను నేనెవరికీ చెప్పలేదు. కాని ఈ రోజున ఈ గాలివానను చూస్తుంటే చెప్పాలని పించింది. చెప్పాను. ఆమెకూడ నీలాగే అందంగా, ఆరోగ్యంగా, అమాయ కంగా, ఉండేది. నిన్ను చూస్తే ఆమె నాకు గుర్తు రాలేదు. ఈరోజు, వాతావరణం గుర్తుకు తెచ్చింది ఆమెను" చెపుతూ తల ఎత్తాడు.

అతను తల ఎత్తగానే—"ఇంత వివరంగా ఇన్ని విష యాలు చెప్తున్నారు. మీకు ఆమె తెలుసా? ఆ కుటుంబం మీకుబాగా తెలుసా?" అని అడిగింది.

తలను ఒక పక్కగా వంచి అదోమాదిరిగా వైరాగ్యంతో కూడిన నవ్వునవ్వి "ఆమె ఎవరో అయితే నాకి బాధ ఎందుకమ్మా? ఈ కన్నీరెందుకు? ఆమె ఎవరో కాదు నర్మద. నర్మద నా కూతురు. ఆ దౌర్భాగ్యుడ్ని నేనే నమ్మా!" అన్నాడు. రాఘురావు కంటివెంట రెండు కన్నీటి బిందువులు రాలిపడ్డాయి.

"నర్మద పడుతున్న బాధలను కళ్ళారాచూస్తూ ఆ నరకాన్ని అనుభవిస్తున్న ఆ తండ్రిని నేనేనమ్మా!" అన్నాడు రాఘవరావు ఆమె వంక తిరిగి.

"అయ్యయ్యో! ఎంత, బాధాకరమైన విషయం? ఇంతకూ ఆమె ఏమైంది? అతనేమయినాడు? వాళ్ళుకులాసాగాలేరా?" చెమ ర్చిన కళ్ళతో అడిగిందామె.

అవును. అడగవలసిన విషయమే అది. రమేష్ నర్మద కులాసాగా ఉంటే ఇంత బాధ నాకెందుకు? కొంతలో కొంత తృప్తి అని సర్దుకొనేవాడిని. కాని అలా జరగలేదు.... అసలేం జరిగిందంటే... అసలు..." రాఘవరావుకు మాటలు రాలేదు. తల వంచుకున్న వాడల్లా కుర్చీలోంచి లేచి కంటిబిందువులను తుడుచుకుని గంభీరంగా ఉండటానికి ప్రయత్నం చేస్తూ గదిలో రెండు మూడు సార్లు పచార్లు చేశాడు. గుమ్మం దగ్గరికెళ్ళి "కోనారి" అంటూ కేక వేశాడు. మూడో పిలుపుకి పరుగెత్తుకుంటూ వచ్చాడు కోనారి.

"మూర్తిగారు రాలేదా?" అని అడుగుతూండగానే ఎ. ఎస్. ఎమ్. మూర్తిగారు వచ్చాడు. అతనికి చార్జి అప్పగించి "పదమ్మా! ఇంటిదగ్గర విశ్రాంతి తీసికుందాం, అక్కడే మాట్లాడుకోవచ్చు" అంటూ ఆమెను తీసుకుని బయలుదేరాడు. ఇంటితాళం తీస్తుంటే "మీరొక్కరే ఉంటున్నారా బాబుగారు?" అంటూ అడిగిందామె.

"ఒంటరిగా ఉండమని దేవుడు వ్రాసిన తరువాత తప్పుతుందామ్మా!"

ఆమె సమాధాన మీయలేక పోయింది. దీపం వెలిగించి ఆమె కుర్చోటానికి కుర్చీ చూపించి, స్టవ్ వెలిగించి నీళ్ళు పెట్టాడు. స్టవ్ ముందు గొంతుకిళ్ళా కూర్చుంటూ "అసలు నర్మద చాలా మంచిపిల్ల అమ్మలూ! నామాటనెప్పుడు కాదని ఎరుగదు. కాని అలాంటి నర్మద నన్ను మోసంచేసి, తన్ను మోసంచేసుకుంటుందనుకోలేదు. ఈ దౌర్భాగ్యస్థితిని తెచ్చుకుంటుందనుకోలేదు." అంటూ ఆగాడు రాఘవరావు.

స్టవ్‌లోని మంటలు అరని ముఖం మీదపడి అతని ముఖం మీది విషాదాన్ని మరీ నీలంగా చూపిస్తున్నాయి. ఆస్టవ్ ధ్వనిలో అతడు విడిచిన నిట్టూర్పులు ఆమెకు వినిపించలేదు.

"నేనప్పుడు చేసేది చిన్న ఉద్యోగమయినా, కుటుంబం పెద్దదయినా నర్మద పెళ్ళి ఘనంగానే చేయాలని అన్ని ఏర్పాట్లూ చేశాను. అయిదు వేలు కట్నంతో సంబంధం స్థిరపరిచాను. నర్మద కన్నీ తెలుసు. కాని నర్మద తప్పటడుగు వేసింది. ఆనాడు నర్మదేగాని ఆ పొరపాటు చేయకండా ఉండి ఉంటే ఈ నాడు మంచి హోదాగల డాక్టరు భార్యగా, పిల్ల పాపలతో సుఖపడేది. వాళ్ళమ్మ నాకు బదులు కాఫీ తానే ఇవ్వగలిగేది. వాళ్ళ చెల్లెలు శాంత అత్తవారింటిలో బాధలు పడేదికాదు. నాకీ ఒంటరి జీవితం తప్పేది. కాని నర్మద ఆలోచించకండ అడుగువేసింది. అనుభవిస్తోంది." కాఫీని కలిపి ఆమెకొక కప్పునిస్తూ "ఈ ఉద్యోగంలో చేరిన తరువాత కాఫీ, టీలు త్రాగటం ఎక్కువై పోయిందమ్మా. నీవూ కొద్దగా తీసుకో" అన్నాడు.

"మీరంత బాధపడుతూ చేయటం, ఆ కాఫీని నేను త్రాగటం బాధగా ఉంది బాబుగారూ!"

"బాధ! అవును. నిజంగా బాధే, వింటున్న నీకే బాధగా ఉంటే అనుభవించే వారికెలా ఉండాలి? కాని నర్మద చరిత్ర ఇలా దాగిపోకూడదు. దేశవ్యాప్తం కావాలి. నలుగురూ వినాలి. వారి జీవితాలు మంచి బాటకు పోయేందుకు ఉపయోగపడాలి.

ఆమె అతను వారిస్తున్నా వినక కాఫీ కప్పులు కడిగింది.

"నర్మద ఇంటి నుండి వెళ్ళిపోయిన ఎనిమిది నెలలు తరువాత ఒక మిత్రుడు ఉత్తరం వ్రాశాడు. "నర్మద బెజవాడలో ఉంది. నేను ప్రత్యక్షంగా ఆమె పరిస్థితిని చూశాను. ఆమె పరిస్థితి ఏమీ బాగాలేదు. ఆలస్యం చేయక వెళ్ళి నీ వెంట తీసుకునిరా" అని. అతనిచ్చిన ఎడ్రస్ ప్రకారం బెజవాడకు పరుగెత్తాను. చూశాను నర్మదను. గుర్తుపట్టలేనంతగా మారిపోయింది నర్మద.

చెంపకు చేరదేసి ఉండే కళ్ళు కాంతి విహీనాలయినాయి. గులాబీలు పూచే బుగ్గలు పాలిపోయాయి. త్రాచు పాములాంటి జడకు సంస్కారం లేదు. చిరిగిన బట్టలతో, ఎముకలు వెళ్ళకొచ్చే శరీరంతో, రోడ్డు ప్రక్కన ఉండే ముష్టిదానిలా ఉంది. నే వెళ్ళే సరికి, నన్ను చూడగానే బావురుమని ఏడ్చింది.

"అతనేడమ్మా!" నెమ్మదిగా అడిగాను.

"ఉద్యోగం కోసమని మద్రాసు వెళ్ళారు నాన్నా! అప్పుడే వెళ్ళి మూడునెలలయింది. ఆయన కోసమే ఎదురు చూస్తున్నాను" అంది.

"మూడు నెలలు ఒంటరిగా ఉన్నావామ్మా! పోనీ ఉత్తర మైనా వ్రాసలేదా?" అడిగాను.

"వ్రాశారు నాన్నా! ఒక ఉత్తరం. తరువాత ఏదో సినిమా కంపెనీలో ఉద్యోగం దొరికిందని వ్రాస్తూ ఏభై రూపాయలు కూడా పంపారు. ఏ క్షణంలో వస్తారో అని కనిపెట్టుకుని ఉన్నాను నాన్నా!" అంది.

"మోసపోయావమ్మా! ఎన్ని సంవత్సరాలు ఎదురు చూచినా ఇంతే. నర్మదా! అతను రాడు. నాకు తెలుసు" అన్నాను.

"అలా అనకు నాన్నా! ఆయన నన్నెంతగా ప్రేమిస్తున్నారో నీకు తెలియదు. మేము పారిపోయి వచ్చామనే నీవలా అంటు న్నావు. అలా మోసం చేసే మనిషి కాదు నాన్నా! ఆయన" అంది నర్మద.

అంతగా నమ్మిన నర్మద మనసును మార్చలేక పోయాను. నర్మద ఇచ్చిన చిరునామా పట్టుకుని మద్రాసు వెళ్ళాను. నర్మద ఇచ్చిన ఫోటోను పట్టుకుని సినిమా కంపెనీలో వాకబు చేశాను. అతన్ని చూసినట్టుగాని, అతను ఆ కంపెనీలో పని చేసినట్టుగాని ఎవరూ చెప్పలేక పోయారు. అదే విషయాన్ని నర్మదకు చెప్పాను. నర్మద నా మాటలు నమ్మలేదు. నన్ను ఇక్కడనుండి తీసికెళ్ళాలని మీ ఎత్తు నే చస్తే చస్తాను గాని ఈ యింటిని వదలి పెట్టిరాను. నేనిక్కడనుండివెళ్ళిపోతేనే కనపడక ఆయన పిచ్చివారై పోతారు." అంది. నర్మదను చూచి జాలిపడాలో, బాధపడాలో, కోపపడాలో తెలియటంలేదు. చేసేదేమీ లేక కొద్దిసేపు ఏడ్చాను. చివరికి నర్మదను ఆ యింటివారికి చెప్పి నర్మదకున్న అప్పులన్నింటినీ తీర్చి, వచ్చాను. మూడుమాసాలు గడిచాయి. నర్మద ఆడపిల్లను ప్రసవించింది. మరి మూడు రోజులకే తెలిసింది. రమేష్‌కు పెళ్ళయిందని. అతడు రాజమండిలో ఉన్నాడని కాని నర్మదకా స్థితిలో చెప్పే సాహసం కలుగలేదు. నెల రోజులు పోయిన తరువాత ఇద్దరు ముగ్గురుచేత చెప్పించాను. నర్మద వారి మాటలు నమ్మలేదు. నేనే చెప్పాను. నర్మద నా మాటలూ నమ్మలేదు. చివరికి నర్మదను పాపను తీసుకుని అతని దగ్గరకెళ్ళాను. ఆ అపర దుష్యంతుడు నర్మదను చూచి "నీవెవరో నాకు తెలియదు" అన్నాడు. నర్మద ఏడిచింది. "నేను నీకేం తాళి కట్టలేదు, పో!"అన్నాడు.

"నాకన్యాయం చేస్తారా? పాప ముఖం చూడండి" అంది.

"నీకు జరిగిన అన్యాయమేదీ లేదు. ఎవరు సుఖాన్ని వారు వెతుక్కున్నారు. తప్పులేదు" అన్నాడు.

నర్మద తనకు జరిగిన పరాభవాన్ని నిగ్రహించుకోలేక పోయింది. రెండు మూడు సార్లు ఆత్మహత్యా ప్రయత్నాన్ని కూడా చేసింది. కాని నా అదృష్టంవల్ల బ్రతికింది. నర్మదమాత్రం మారిపోయింది. క్రమక్రమంగా మతిచెలించటం ప్రారంభించింది.

ఇప్పుడు నర్మద మందులేని వ్యాధితో బాధపడుతూ. విశాఖ మెంటల్ హాస్పిటల్లో ఉంది. పిచ్చివాళ్ళమధ్య చావుకోసం ఎదురుచూస్తూ ఉంది నా బంగారు తల్లి. రాఘవరావు దుఃఖాన్ని నిగ్రహించుకో లేక పోయాడు.

ఆమె కన్నుల్లో కన్నీరుబికింది.

"అతని చేత పరాభవాన్ని పొందిన తరువాత నర్మద అన్న మాటలను నేను మరచి పోలేను. ఆ మాటలు నా గుండెను పిండే స్తాయి బాధను తీవ్రపోగులు పోస్తాయి. నర్మద ఏమన్నదో తెలుసా?"

"ఏ....ఏ...ఏమన్నది, బాబుగారూ?"

"నాన్నా ఆ వర్షరోజు రాత్రి నీవుగాని, అమ్మగాని మరెవ రైనా నన్ను ఆపి మందలించి ఉండి ఉంటే ఇప్పుడీ అవమానం నాకు తప్పేదిగా నాన్నా! నేను తప్పు చేస్తే శిక్షించే హక్కు నీకు లేదూ? ఒక లెంపకాయిచ్చి, మెడపట్టి యింటిలోకి గెంటి ఉంటే నాకీ బాధ తప్పేదిగా నాన్నా! నన్నెందుకాపలేదు నాన్నా! నన్నెం దుకాపుకోలేదు నాన్నా!" అంటూ ఏడిచింది నర్మద మాటలు గుర్తుకొచ్చినప్పుడల్లా గడచిన కాలానంతా దాటి వెనుకకు పరుగెత్తి పోయి...నర్మదను... అమ్మలూ!...అదేమిటి?...ఏడుస్తునావా?"అడి గాడు రాఘవరావు.

"లె...లేదుబాబుగారూ! నర్మద మాటలు వింటూంటేకన్నీరు తిరిగింది" కన్నీరు తుడుచుకుంది. నెమ్మదిగా తలఎత్తి రాఘవ రావును చూస్తూ" "బాబుగారూ అందరూ అతనిలాగే ఉంటారా?" అని అడిగింది.

ఆమె ప్రశ్నకు సమాధానమియ్యక "నీపేరేమిటమ్మా!" అని అడిగాడు.

"నా పేరు ప్రమీల బాబుగారూ! ముందు నా సందేహం నివృత్తిచెయ్యండి" అంది.

రాఘవరావు కొద్దిసేపాలోచించి "ఏ మనిషీ ప్రత్యేకంగా చెడ్డవాడుకాడు ప్రమీలా! కాని మంచితనమో, చెడ్డతనమో ఆపాదింపబడేది మనిషికే. పరిస్థితులమీద నేరాన్ని మోపటం కూడా న్యాయంకాదు. పరిస్థితిని అర్థంచేసుకుని మనిషి వ్యవహరించాలి. అందుకు తగిన విజ్ఞత మనిషికి ఉండాలి. మరి అది ఎక్కడ నుండి వస్తుంది? సమాజం నుండి. సమాజమంటే ఎవరు? నీవూ. నేనూ,. కోనారీ సింహాచలానికి టిక్కట్టు తీసుకున్న యాత్రికులు నా జీవితం నుండి నేను నేర్చుకోలేని పాఠాలను నీవు నేర్చుకోగలవు. నా జీవితం చెడు మార్గాన్న పోతున్నప్పుడు నీవు నీ మార్గాన్ని దిద్దుకోవాలి. దానికి విజ్ఞానం కావాలి, ఎటువంటిదా విజ్ఞానం? మనం సమాజాన్ని చూడగలిగితే చాలు. నర్మద నర్మదకుపయోగపడదు. ఆమెలాగ తప్పుచేసేవారికి ఉపయోగపడుతుంది. రమేష్ జీవితమూ అంతే!"

"ముందు నా ప్రశ్నకు అర్థం చెప్పండి బాబుగారూ!"

"అయితే నీకింకా అర్థంకాలేదా? నర్మదలున్న ప్రతీచోటా రమేష్‌లుంటారు. వాళ్ళెప్పుడూ పలాయనం చిత్తగిస్తూనే ఉంటారు. ఆమె తల్లిదండ్రులకు నచ్చజెప్పి ఆమెనువివాహమాడిలేక ఆమెతో పారిపోయినవాడు. రేపు ఆమెవల్ల ఏర్పడే సమస్యలకు తట్టుకోలేక పారిపోడని గ్యారంటీ ఏమిటి? పిరికి వాడెప్పుడూ పరిస్థితులనుండి పారిపోవాలనే చూస్తాడు. తను మంచి దారిలో వెడుతూ, ఎదుటివారిని సవ్యదిశలో నడిపించేవారు కావాలి సమాజానికి. అటువంటివారరుదు."

ప్రమీల ఏదో అడగాలని తలఎత్తి తలదించుకుంది.

పాసింజరు ట్రైనుకి టి. పి. లైన్ క్లియర్ గంట కొట్టాడు.

రాఘవరావు కుర్చీలోంచి లేస్తూ "అమ్మాయీ! మీ బండికి లైన్ క్లియరైంది" అన్నాడు.

"అవును. లైన్ క్లియరయింది" అంది ప్రమీల.

"లే! లేచి. కొద్దిగ కాళ్ళూ, చేతులు ముఖం కడుక్కొని, తయారవు. ఈ దీపాన్ని తీసికెళ్ళు. బాత్‌రూములో సబ్బు, తువ్వాలు ఉన్నాయి.

ప్రమీల కదల లేదు. ఏదో ఆలోచిస్తూ తలదించుకుంది.

"అమ్మలూ! ప్రమీలా!!" హెచ్చరించాడు రాఘవరావు.

"నేను వెళ్ళబోవటంలేదు బాబూగారూ. నేను వెళ్ళను" అంది ప్రమీల.

"అదేమమ్మా!!"

"అదంతే బాబుగారు! నేను వెళ్ళను. మీరు మాత్రం తాకు తోడుగావచ్చి, మాయింటికి దిగబెట్టి వెళ్ళిపోండి. తెల్లవారే లోగ నేను చేరాలి. నాన్నగారికి కూడ మీరేనచ్చజెప్పాలి" అంది తలదించుకునే ప్రమీల.

"అంతా విచిత్రంగా ఉందమ్మా! నీగురించి నాకేం తెలుసని చెప్పమంటావు చెప్పు".

"నా చేత చెప్పించాలనే గాని. మీరామాత్రం గ్రహించ లేదా?"... నేనూ... నర్మద లాగే...కాని అతనక్కడున్నాడు ... నా పెళ్ళి నిశ్చయమైంది... అందుకనే బయలుదేరి పోవాలని యిక్కడికొచ్చాను. కాని వెళ్ళను. నర్మద రమేష్‌లు జంటగా బయలుదేరి కూడ, జంటగ ఎక్కువకాలం ఉండలేక పోయారు. ఆమె నాశనమైంది. అతను హాయిగానే ఉన్నాడు. మరి ఒంట రిగా వెడుతున్న నన్ను ఆదరించక! "నీ వెవరు?" అంటే నేనేం చెయ్యాలి? ఏమీ చేయని నేరానికి అందరిమధ్య దోషిగా నిల బడక తప్పదు. నేనేం నేరం చేయలేదు. తెల్లవారేలోపుగా మాత్రం...మీ సహాయాన్ని జన్మజన్మలకు మరిచిపోను" ప్రమీల కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి

నిద్ర నుండి లేచిన రంగస్వామి జట్కా కట్టాడు.

పాసింజరు అవుటర్ సిగ్నల్ దగ్గర అరుస్తోంది,

జట్కా కృష్ణాపురం వైపు బయలుదేరింది.

◆ ◆ ◆ ◆

"ఈ పెళ్ళి సందడిలో నీవు వచ్చావన్నది విన్నానేగాని పలకరించటం కాలేదు రాఘవా! నీవు దేవుడిలా ఆదుకున్నావు. లేకపోతే ప్రమీల పెళ్ళి జరిగేది కాదు."

"నేను చేసిందేముంది పార్వతీ! నన్ను పొగడకు" తల దించుకుకుని అరటి బోదెలకేసి చూస్తూ అన్నాడు రాఘవరావు.

"అలా అనకు రాఘవా! ప్రమీల నాకంతా చెప్పింది. నీవు ప్రమీల నాకంతా చెప్పింది. నీవు ప్రమీలను వెంటపెట్టుకొని రావటం నేను చూశాను. నీవు ఆయనతో మాట్లాడటంకూడా విన్నాను. కాని, ఆ రాత్రి "నీవు అని గుర్తు పట్టలేదు. ఈనాడు పందిరిలో చూశాను. గుర్తు పట్టాను. నీవు దేవుడివి నన్ను నా కుటుంబాన్ని రెండు సార్లు ఆదుకున్నావ్....'' ఆగిపోయి. అటు ఇటు చూచి కొద్దిగ దగ్గరగావచ్చి స్వరాన్ని తగ్గించి "ఆ నాడు నేనే సాహసం చేశానో, ఈనాడు అదేసాహసాన్ని చేసింది ప్రమీల ఆనాడూ నన్ను ఇలానే వారించి వెనుకకు పంపావు. నీలాగ మనుషులను పరిస్థితులను అర్థం చేసికుని త్యాగం చేయగల వారెందరు? ఆ నాడు నీవు చేతకానివాడివని, అసమర్థుడవనీ నిందించాను. ఏడ్చాను. తరువాత అర్థమైంది. నీవు లోకాన్నెంత బాగా అర్థం చేసికున్నదీ. నీవు సామాన్యుడవుకావురాఘవా? దేవుడివి" అన్నది. ఆమె కళ్ళు కొద్దిగ చెమర్చాయి.

"కాదులే పార్వతీ! నేను మామూలు మనిషినే! వస్తాను. సెలవియ్యి" చేతులు జోడించాడు రాఘవరావు.

"వెళ్ళిపోదువుగానిలే రాఘవా! తొందరే! తలఎత్తు. సిగ్గు పడతావేం? నేనానాటి పార్వతిని కాను....నా కొక విషయం చెప్పు రాఘవా? ప్రమీల నా కూతురని నీకెలా తెలుసు? ప్రమీలను నీవెలా గుర్తుపట్టావు?''

రాఘవరావు కొద్దిసేపాగి అన్నాడు. "ప్రమీల నీ కూతురని నాకు తెలియును. అసలు ప్రమీలను అంతకుముందెప్పుడూ చూడలేదు. కాని ఆమె ముఖంలో నీ పోలికలు చాలా కనిపించాయి. అమె కూర్చున్నప్పుడు ఒక ప్రక్కగా చూస్తే నీవేమో అన్న భ్రాంతికూడా కలిగింది. ఆమె నడుస్తున్నా. మాటాడుతున్నా నీవే గుర్తుకొచ్చావు. వెనువెంటనే 'ఆ రాత్రి' గుర్తుకొచ్చింది. ప్రమీల తొందరపాటుకు బాధకలిగింది. రంగసామి నామీదున్న గౌరవం చేత ప్రమీలగురించి అంతాచెప్పాడు. నీవే గుర్తుకొస్తూంటే ప్రమీలమీద జాలి చూపకతప్పలేదు. రంగసామిని వెళ్ళిపోవద్దని చెప్పివచ్చాను. నీ ప్రమీల నీ కూతురయి ఉంటుందనిమాత్రం నేను ఏదీచేయులేదు. ప్రమీల ఎవరయినా నేను చేయగలిగేది అదే. నేనాఊరి స్టేషన్ మాష్టర్‌గా ఉన్నంతకాలం నా చేతిమీదుగా ఇలాంటి వారికి టిక్కట్టివ్వను పార్వతీ! ఇదినిజం"

"ఇంతమందిని రక్షించిన నీవు నర్మదను మాత్రం రక్షించుకో లేకపోయావు!

"ప్రమీలలాంటి వారి కోసం నర్మద లాంటి వారుండాలి పార్వతీ!"

"నిండుకుండవు భార్యపోయింది. కూతురిలా అయింది. చిన్నకూతురు సంసారం సరిగాలేదు. అయినా నీవు తొణకటంలేదు. బాధపడటంలేదు.

"బాధపడినంత మాత్రాన ప్రయోజనమేమిటి పార్వతీ! ఎవరి జీవితాన్ని వారు జీవించక తప్పదు. మనంచెప్పినట్టు జీవితం ఉండదు. జీవితం చెప్పినట్టు మనం నడవాలి. బాధను బాధగా తీసికుంటే బ్రతకలేం"

అంతా నాటకంలో మాటాడినట్టు మాటాడతావు రాఘవా? ఇంకా నాటకాలేస్తున్నావా?"

"లేదు పార్వతీ, మానేశాను. జీవిస్తున్నా నటిస్తున్నావని;

నేను ఒక నాటకాం రాయుడననీ; నా ఆరాధన ఒక నాటకమనీ, మీవాళ్ళంతా నన్ను దూరంచేసిన తరువాత .... నాటకరంగం మీద జీవించే నేను, వాళ్ళందరికి తృప్తి కోసం నిన్ను దూరం చేసికున్నాను. ఆనాటినుంచి సేజెక్కటంమానేశాను. కాని జీవితంలో నటించక తప్పదుగా! అప్పుడప్పుడు నటిస్తున్నాను. ఆ రాత్రికూడ ప్రమీల ముందు నటించక తప్పలేదు" తలదించుకున్నాడు రాఘవరావు.

"అంటే:"

"నర్మద నాకల్పన" తలదించుకునే అన్నాడు.

"కల్పనా? మరి........ గుండెజబ్బుతోమరణించిన నీభార్య!"

"నాకు భార్యలేదు"

"రాఘవా? నీకు భార్యలేదూ! ....మరి....మరి.... నీవు...."

"ఔం.... నేను నేనే నాకునేనే.... వస్తానూ...."

"రాఘవా! ఆగు. నీపరిస్థితికి బాధపడకూడదని యిలా అంటున్నావా?.... ఇది కూడానటనేనా?" ముందు పార్వతి గొంతు బొంగురుపోయింది.

సన్నగా నీరసంగా నవ్వాడు రాఘవరావు.

"నటనే! పార్వతీ! నాజీవితమంతానటనే ఈనటనే పార్వతీ, నన్ను కోరుకున్న అమ్మాయిని నాకుదగ్గరచేసింది. ఈనటనేనానుండి ఆమెను దూరం చేసింది. ప్రమీల రహస్యాలు నాకు తెలుసని రంగసామి ముందు నటించాను. ఇది నిజం నర్మదకు జీవంపోసి ప్రమీల కోసం ప్రమీల ముందు నటించాను. ఇదీ నిజమే కానీ ఇప్పుడు మాత్రం....ఈ క్షణానమాత్రం, నటించటంలేదు పార్వతీ నన్ను నమ్ము" ఎడంభుజంమీదనుండి ఛాతీమీదుగా కుడి ప్రక్కకు పోతున్న మూడు పోగులను కుడిచేతితో బయటకులాగి ఆమెకు కనుపించేలా చూపించి వెనుతిరిగి గబగబా అడుగులువేసి కుంటూ వెళ్ళిపోయాడు రాఘవరావు.

—..—